## సిక్కిం సీఎంగా తమాంగ్ ప్రమాణం

గ్యాంగ్‌టక్, జూన్ 10: సిక్కిం సీఎంగా ఎస్కేఎం అధినేత ప్రేమ్‌సింగ్ కుమార్ తమాంగ్(56) సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య గ్యాంగ్‌టక్‌లో ఆయన చేత ప్రమాణం చేయించారు. తమాంగ్ సిక్కిం పాలనా పగ్గాలు చేపట్టడం వరుసగా ఇది రెండోసారి. తమాంగ్‌తో పాటు 11 మంది ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. మాజీ సీఎం పవన్ కుమార్ చామ్లింగ్‌ను ఓడించిన ఇద్దరు ఎమ్మెల్యేలకు క్యాబినెట్‌లో చోటు దక్కింది. గతంలో తమాంగ్‌పై తిరుగుబాటు చేసిన మణికుమార్ శర్మను ఓడించిన నర్ బహదూర్ దహాల్‌ను కూడా మంత్రి పదవి వరించింది. అధికార పార్టీలో నలుగురు మహిళా ఎమ్మెల్యేలు ఉన్నా క్యాబినెట్‌లో ఒక్కరికి కూడా చోటు దక్కలేదు. తమాంగ్ నేతృత్వంలోని ఎస్కేఎం తాజా శాసన సభ ఎన్నికల్లో 32 స్థానాలకు గాను 31 సీట్లలో ఘన విజయం సాధించింది.

## 7 రాష్ట్రాల్లోని 13 అసెంబ్లీ సీట్లకు బైపోల్స్

న్యూఢిల్లీ, జూన్ 10: ఏడు రాష్ట్రాల్లోని 13 అసెంబ్లీ స్థానాల ఉప ఎన్నికలు జూలై 10న నిర్వహించనున్నట్టు కేంద్రం ఎన్నికల సంఘం సోమవారం ప్రకటించింది. ఎమ్మెల్యేల రాజీనామా లేదా మరణం వల్ల ఖాళీ అయిన ఈ స్థానాల ఉప ఎన్నికలకు ఈ నెల 14న నోటిఫికేషన్ జారీ చేయనున్నట్టు తెలిపింది. నామినేషన్ల దాఖలుకు ఈ నెల 21 ఆఖరు తేదీ అని వెల్లడించింది. జూలై 13న ఓట్ల లెక్కింపు జరుగుతుందని, జూలై 15లోగా ఎన్నికల ప్రక్రియ పూర్తి కావాలని ఈసీ తెలిపింది. పశ్చిమ బెంగాల్‌లో అత్యధికంగా నాలుగు స్థానాలకు ఉప ఎన్నికలు జరగనున్నాయి.

## 2014లో 46.. 2019లో 58.. 2024లో 72

న్యూఢిల్లీ: మోదీ మంత్రివర్గంలో మంత్రుల సంఖ్య రానురానూ పెరుగుతున్నది. 2014లో మొదటిసారి ఆయన ప్రధాని పదవిని చేపట్టినపుడు ఆయన క్యాబినెట్‌లో 46 మంది మంత్రులు ఉండేవారు. రెండోసారి 2019లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినపుడు ఆ సంఖ్య 58కి పెరిగింది. తాజాగా అది 72కు చేరింది.2019–2024 పర్యాయంలో 2021లో మంత్రివర్గ విస్తరణ చేపట్టారు. దీంతో మంత్రుల సంఖ్య 78కి పెరిగింది. నిబంధనల ప్రకారం గరిష్ఠంగా 81 మంది మంత్రులను నియమించేందుకు అనుమతి ఉంటుంది.


**దక్షిణ మధ్య రైల్వే**
Follow us on @SCRailwayindia
ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in పై చూడవచ్చును.

**టెండరు నం. 07-OEW-24-25-Sr. DEE-M-HYB** PUB/0548

**దిగువ టెండర్లు ముగింపు తేదీ: 03-07-2024**న **15.00** గంటలకు సంబంధించి భారత రాష్ట్రపతి తరపున వ్యవహరిస్తున్న **సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్/మెయింటెనెన్స్/ హైదరాబాద్** వారు ఇ-టెండర్లు కోరుతున్నారు. బిడ్డర్లు తమ ఒరిజినల్/ రివైజ్డ్ బిడ్లను ముగింపు తేదీ మరియు సమయం వరకు మాత్రమే దాఖలు చేయగలుగుతారు. ఈ టెండరుకు సంబంధించి మాన్యువల్ ఆఫర్లు అనుమతించబడవు మరియు ఏదేని అటువంటి మాన్యువల్ ఆఫర్ స్వీకరించినప్పటికీ తిరస్కరించబడుతుంది.

**క్ర.సం. 1. పని వివరణ:** టెండరు నం. 07-OEW-24-25-Sr.DEE-M-HYB: హైదరాబాద్ డివిజన్: హైదరాబాద్ డివిజన్‌లో స్టేషన్ భవనాలు, సర్వీస్ భవనాలు, నివాస భవనాలు మరియు LC గేట్ల వద్ద 2.742 MW సోలార్ ప్లాంట్స్ (రూఫ్ టాప్) మరియు 300 KWP ల్యాండ్ బేస్డ్ సోలార్ ప్లాంట్స్ ఏర్పాటు. **సుమారు వ్యయం:** రూ. 20,56,06,767/– **బయానా:** రూ. 11,78,400/–, **పూర్తి చేయు కాలం:** 4 నెలలు, **ముగింపు తేదీ:** 03-07-2024.

**వెబ్‌సైట్ వివరాలు: www.ireps.gov.in**

**టెండరు పూర్తి వివరాలు చూసేందుకు నోటీసు బోర్డు ప్రదేశం:** సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్/మెయింటెనెన్స్/ హైదరాబాద్, హైదరాబాద్ భవన్ కార్యాలయం, సికింద్రాబాద్- 500071.

**సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్, హైదరాబాద్**

**ఓపెన్ ఇ-టెండరు ప్రకటన నం. B/E.EGS/05/2024-25 తేదీ: 10-06-2024** PUB/0549

భారత రాష్ట్రపతి తరపున దిగువ సంతకందారు దిగువ పనుల కొరకు ప్రతిదానికి ఎదురుగా తెలిపిన తేదీన **15.00 గంటల** వరకు ఇ-టెండర్లు కోరుచున్నారు.

1. B/E.29/I/EGS/09/24-25 తేదీ:08-06-2024, **పని పేరు:** విజయవాడ డివిజన్: ELS/BZA–త్రీ ఫేజ్ లోకోమోటివ్స్ (WAP7 & WAG9) యొక్క నిర్వహణ కొరకు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సదుపాయాల ఏర్పాటు- విద్యుత్ సదుపాయాలు. **పూర్తిచేయు కాలం:** 09 నెలలు, **టెండరు విలువ:** రూ. 36,45,706.52/– **బయానా/బిడ్ సెక్యూరిటీ:** రూ. 72,900/–, **టెండరు డాక్యుమెంట్ ధర:** లేదు, **ముగింపు తేదీ:** 01-07-2024.

1. కాగోరు టెండరుదారులు ఏదైనా టెండరుకు ఏవైనా మార్పులు/సవరణ గమనించుటకు టెండరు ముగింపు తేదికి ముందు వెబ్‌సైట్ **"www.ireps.gov. in"** ను దర్శించవల్సిందిగా సూచించడమైనది.

**డివిజనల్ రైల్వే మేనేజర్ (ఎలక్ట్రికల్), విజయవాడ**
A0698

**తదుపరి టెండరు నిబంధనలు/వివరాల కోసం మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కోసం వెబ్‌సైట్ https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in దర్శించండి**


# పాత వారికే ప్రధాన శాఖలు

మొదటిపేజీ తరువాయి...

ఆరోగ్య శాఖను తిరిగి పొందారు. గత ప్రభుత్వంలో స్మృతి ఇరానీ నిర్వర్తించిన మహిళా, శిశు సంక్షేమాభివృద్ధి శాఖను అన్నపూర్ణా దేవికి ఇచ్చారు. ఈ మేరకు మంత్రులకు కేటాయించిన శాఖల వివరాలతో కూడిన జాబితాను రాష్ట్రపతి కార్యాలయం సోమవారం విడుదల చేసింది.

### తెలుగు ఎంపీలకు కీలక పదవులు

కేంద్ర క్యాబినెట్‌లో తెలుగు రాష్ట్రాల ఎంపీలకు కీలక పదవులు దక్కాయి. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రిగా నియమితులయ్యారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కి కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి పదవి దక్కింది. తెలంగాణలో ఈ హోదా దక్కిన మూడో ఎంపీ బండి సంజయ్ కావడం విశేషం. గతంలో కిషన్‌రెడ్డి, మాజీ గవర్నర్ విద్యాసాగర్ రావు సైతం కేంద్ర హోం శాఖ సహాయ మంత్రులుగా పనిచేశారు. శాఖల కేటాయింపు తర్వాత కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. దేశాభివృద్ధిల్లో బొగ్గు పాత్ర కీలకమని, బొగ్గు వెలికితీత, ఎగుమతి, ఉద్యోగుల సంక్షేమం తదితర అంశాలపై పని చేస్తానని చెప్పారు. అధికారులతో చర్చించిన తర్వాత ఒకట్రెండు రోజుల్లో 'మిషన్ 100 డేస్ అజెండా'తో ముందుకెళ్తామన్నారు. దేశమంతా విద్యుత్తు డిమాండ్ పెరుగుతున్నదని, దీనికి అనుగుణంగా బొగ్గు కొరత లేకుండా విద్యుదుత్పత్తి పెంచడంపై దృష్టి సారిస్తామన్నారు. వరంగల్‌లో విమానాశ్రయం ఏర్పాటు కోసం ప్రయత్నిస్తానన్నారు.

### ఏపీ నుంచి ఇద్దరు సహాయ మంత్రులు

తాజా క్యాబినెట్‌లో ఏపీకి చెందిన టీడీపీ ఎంపీ రామ్మోహన్ నాయుడుకు కేంద్ర పౌర విమానయాన శాఖ బాధ్యతలు అప్పగించారు. పెమ్మసాని చంద్రశేఖర్‌కు గ్రామీణాభివృద్ధి, సమాచార శాఖల సహాయ మంత్రి, భూపతిరాజు శ్రీనివాస వర్మకు భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖల సహాయ మంత్రి పదవి దక్కింది. మరోవైపు కేంద్ర క్యాబినెట్‌లో చేరిన బీజేపీ మిత్రపక్షాలపై జేడీయూ, జేడీఎస్, హెచ్ఏఎం, ఎల్జేపీ(రామ్ విలాస్)ల్లో పలు పార్టీలకు కీలక మంత్రి పదవులు దక్కాయి. జేడీఎస్ నేత హెచ్‌డీ కుమారస్వామికి కీలకమైన భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖను కేటాయించారు. ఇక జేడీయూ నేత లలన్ సింగ్‌కు పంచాయతీ రాజ్‌తో సహా పలు ఇతర శాఖలు దక్కాయి.

### శాఖల్లో జోడింపులు.. కోతలు

గత ప్రభుత్వంలో మంత్రులుగా చేసిన వారిలో కొంత మందికి అదనపు శాఖలు కేటాయించగా, మరికొంత మందికి శాఖల్లో కోత విధించారు. అశ్వినీ వైష్ణవ్‌కు రైల్వే శాఖతోపాటు కీలకమైన ప్రసార శాఖ బాధ్యతలను కూడా అప్పగించారు. హర్దీప్ సింగ్ పురీ నిర్వర్తించిన శాఖల్లో గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి శాఖను ఆయన నుంచి ఈసారి తీసేసుకొన్నారు. కిరణ్ రిజిజును ఎర్త్ సైన్సెస్ నుంచి పార్లమెంటరీ వ్యవహారాలకు మార్చారు. గిరిరాజ్ సింగ్‌ను గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ నుంచి జౌళీ శాఖకు మార్చారు. అర్జున్ రామ్ మేఘ్వాల్‌ను న్యాయశాఖ మంత్రిగా కొనసాగించారు. నూతన క్యాబినెట్‌లో మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన మాజీ సీఎంలకు కీలక శాఖలు దక్కాయి. మధ్యప్రదేశ్ మాజీ సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్‌కు వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ దక్కింది. హర్యానా మాజీ సీఎం ఖట్టర్‌కు విద్యుత్తు, పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఇచ్చారు.



### పీఎం కిసాన్ నిధుల విడుదలపై ప్రధాని మోదీ తొలి సంతకం

న్యూఢిల్లీ, జూన్ 10: భారత ప్రధానిగా నరేంద్ర మోదీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. వరుసగా మూడోసారి ప్రధాని అయిన తర్వాత ఆయన పీఎం కిసాన్ 17వ విడత నిధుల విడుదలకు సంబంధించిన ఫైల్‌పై తొలి సంతకం చేశారు. దీని ద్వారా దేశంలోని దాదాపు 9.3 కోట్ల మంది రైతులకు రూ.20 వేల కోట్ల మేర లబ్ధి చేకూరనున్నది. రైతుల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉన్నదని నిధుల విడుదల ఫైల్‌పై సంతకం తర్వాత మోదీ పేర్కొన్నారు. భవిష్యత్తులో వ్యవసాయ రంగం అభివృద్ధి కోసం మరింత కృషి చేస్తామని అన్నారు.

### 3 కోట్ల ఇండ్ల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్

**తొలి క్యాబినెట్ భేటీలో నిర్ణయం**

ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) కింద దేశవ్యాప్తంగా అదనంగా 3 కోట్ల ఇండ్ల నిర్మాణాలు చేపట్టేందుకు ప్రధాని మోదీ నేతృత్వంలోని క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కేంద్రంలో మూడోసారి అధికారం చేపట్టిన తర్వాత ఎన్డీయే సర్కార్ తొలి క్యాబినెట్ సమావేశం సోమవారం ప్రధాని మోదీ నివాసంలో జరిగింది. ఈ సందర్భంగా మంత్రివర్గం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈ సమావేశానికి ఎన్డీయే మిత్ర పక్షాల మంత్రులంతా హాజరయ్యారు. 'గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అర్హులైన పేద కుటుంబాల సంఖ్య పెరిగింది. గృహ అవసరాలను తీర్చేందుకు అదనంగా మరో 3 కోట్ల గ్రామీణ, పట్టణ కుటుంబాలకు ఇండ్ల నిర్మాణంలో సహాయం చేయాలని క్యాబినెట్ సమావేశం నిర్ణయించింది' అని కేంద్ర అధికారులు వెల్లడించారు.

## స్వతంత్ర భారతంలో ఇదే తొలిసారి!

న్యూఢిల్లీ: కేంద్ర మంత్రివర్గంలో ముస్లిం లేకపోవడం స్వాతంత్ర్యానంతరం ఇదే మొదటిసారి. గత మోదీ క్యాబినెట్‌లో ముస్లిం నేత ముక్తార్ అబ్బాస్ నఖ్వీ మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రిగా పని చేశారు. 2014లో మోదీ మంత్రివర్గంలో ముస్లిం నేత నజ్మా హెప్తుల్లా మంత్రిగా పనిచేశారు. 1999లో వాజ్‌పాయి మంత్రివర్గంలో ముస్లిం నేతలు షానవాజ్ హుస్సేన్, ఒమర్ అబ్దుల్లా మంత్రులుగా పని చేశారు. 1998లో వాజ్‌పాయి మంత్రివర్గంలో నఖ్వీ మంత్రిగా పని చేశారు.

## స్పీకర్ పోస్టుపై టీడీపీ, జేడీయూ కన్ను!

న్యూఢిల్లీ, జూన్ 10: కేంద్రంలో 72 మంది మంత్రులతో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. ఇక కీలకమైన లోక్‌సభ స్పీకర్ ఎన్నిక జరుగాల్సి ఉన్నది. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఈసారి సొంతంగా మెజార్టీ సాధించలేకపోయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈసారి స్పీకర్ పోస్టుపై ఎన్డీయే కూటమి ప్రభుత్వంలో కింగ్ మేకర్లుగా మారిన టీడీపీ, జేడీయూ కన్నేశాయి. బీజేపీ తమపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొన్న నేపథ్యంలో స్పీకర్ పోస్టును దక్కించుకోవాలని ఈ రెండు పార్టీలు ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. గత రెండు పర్యాయాలు బీజేపీ ఎంపీనే స్పీకర్ అయిన విషయం తెలిసిందే. 2014–19 మధ్య సుమిత్రా మహాజన్, 2019–24 మధ్య ఓంబిర్లా సభాపతులుగా పనిచేశారు.

### పలు సమయాల్లో స్పీకర్‌ది కీలకపాత్ర

లోక్‌సభ స్పీకర్‌కు సభ నిర్వహణ, ఇతర అంశాల్లో పలు అధికారాలు ఉంటాయి. నేటి రాజకీయ పరిస్థితుల్లో ఈ పోస్టు చాలా కీలకంగా మారింది. పార్టీ ఫిరాయింపుల సమయంలో సభ్యుడిపై అనర్హత వేటు విషయంపై స్పీకరే నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. మరోవైపు ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం, సభలో కీలక బిల్లుల గట్టెక్కడం, సభలో సభ్యులు మాట్లాడే అవకాశం వంటి విషయాల్లో స్పీకర్‌ది కీలక పాత్ర అవుతుంది.

## బీహార్ ఎన్నికల తర్వాత కేంద్రంలో కొత్త సర్కార్

మొదటిపేజీ తరువాయి...

మార్క్ అందుకోలేదని, అయినప్పటికీ ప్రధానిగా మోదీ నేతృత్వంలో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేశారని విమర్శించారు. 'చంద్రబాబు, నితీశ్‌ల మద్దతుతో మోదీ, బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగారు. ఎన్డీయే సర్కార్ జీవితకాలం భాగస్వామ్య పక్షాల మద్దతుపై ఆధారపడింది. అదానీ, అంబానీల కోసం మోదీ ప్రభుత్వాన్ని నడుపుతారు. అదానీ, అంబానీల కోసమే మోదీ 3.0 ప్రభుత్వం పనిచేస్తుంది. ఈ నేపథ్యంలో బీహార్ ఎన్నికల తర్వాత కేంద్రంలో ప్రభుత్వం మారుతుంది' అని అన్నారు.

## క్యాబినెట్‌పై అసంతృప్తి సెగలు

- సహాయ మంత్రి కేటాయింపుపై శివసేన పెదవి విరుపు



శ్రీరంగ్ బర్నే

పుణే, జూన్ 10: కేంద్రంలో ప్రధాని మోదీ నేతృత్వంలో కొత్తగా ఏర్పాటైన క్యాబినెట్ కూర్పుపై అసంతృప్తి సెగలు రేగుతున్నాయి. భాగస్వామ్య పక్షాలకు మంత్రి పదవులు కేటాయింపుపై శివసేన(షిండే వర్గం) తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. తమ కంటే తక్కువ ఎంపీ సీట్లు గెలుచుకొన్న ఇతర ఎన్డీయే పక్ష పార్టీలకు క్యాబినెట్ హోదా కలిగిన మంత్రి పదవులు కేటాయించి.. మహారాష్ట్రలో ఏడు లోక్‌సభ స్థానాలు గెలుచుకొన్న తమకు మాత్రం సహాయ మంత్రి పదవి ఇవ్వడంపై పెదవి విరిచింది. పదవుల కేటాయింపులో బీజేపీ పక్షపాతం చూపిందని శివసేన(షిండే) ఎంపీ శ్రీరంగ్ బర్నే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కనీసం క్యాబినెట్ హోదా మంత్రి పదవి దక్కుతుందని ఆశించామని అన్నారు. మరోవైపు లోక్‌సభ ఎన్నికల్లో ఒక్క ఎంపీ సీటు గెలుచుకొన్న అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ కూడా మంత్రి పదవి కేటాయింపుపై వేచి చూసే ధోరణిలో ఉన్నట్టు కనిపిస్తున్నది.

### 15 స్థానాల్లో పోటీచేసి ఏడు గెలిచాం

ఐదు సీట్లు గెలిచిన చిరాగ్ పాశ్వాన్ పార్టీకి, రెండు సీట్లు గెలుచుకొన్న జేడీఎస్ నేత హెచ్‌డీ కుమారస్వామి, ఒక్క సీటు మాత్రమే గెలిచిన జితిన్ రాం మాంఝీకి క్యాబినెట్ పదవులు ఇచ్చారని శ్రీరంగ్ బర్నే ఈ సందర్భంగా పోలిక తెచ్చారు. ఎన్డీయే కూటమిలో జేడీయూ, టీడీపీ తర్వాత తమ పార్టీనే పెద్ద భాగస్వామి అని అన్నారు. మహారాష్ట్రలో 15 సీట్లలో పోటీచేసిన తాము ఏడు సీట్లలో విజయం సాధించామని, 28 స్థానాల్లో నిలిచిన బీజేపీ కేవలం తొమ్మిదింటిలో మాత్రమే గెలిచిందని ఆయన ఈ సందర్భంగా ఎత్తిచూపారు. బీజేపీ పాత మిత్రుడిగా ఉన్న శివసేనకు కేంద్ర మంత్రివర్గంలో ఒక క్యాబినెట్ హోదా మంత్రి, ఒక సహాయ మంత్రి పదవిని ఆశిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. మరో మూడు నెలల్లో అసెంబ్లీ ఎన్నికలను కలిసి ఎదుర్కోనున్న నేపథ్యంలో శివసేనకు తగిన గౌరవం దక్కుతుందని భావిస్తున్నామన్నారు. షిండే తీసుకొన్న నిర్ణయం వల్లే రాష్ట్రంలో అధికార మార్పు జరిగిందన్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని బీజేపీ నుంచి తగిన వైఖరిని తాము ఆశిస్తున్నామని ఎంపీ శ్రీరంగ్ చెప్పారు.

## బీజేపీ కొత్త అధ్యక్షుడు ఎవరు?

న్యూఢిల్లీ: బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డాను కేంద్ర మంత్రివర్గంలోకి తీసుకోవడంతో తదుపరి పార్టీ అధ్యక్షుడు ఎవరన్న దానిపై జోరుగా చర్చ నడుస్తున్నది. మహారాష్ట్ర మాజీ మంత్రి, బీజేపీ జనరల్ సెక్రటరీ వినోద్ తావ్డే పేరు రేసులో ప్రధానంగా వినిస్తున్నది. బీఎల్ సంతోష్ తర్వాత పార్టీ జనరల్ సెక్రటరీల్లో అత్యంత ప్రభావవంతమైన నేతగా తావ్డేకు పేరున్నది. అలాగే తెలంగాణకు చెందిన కే లక్ష్మణ్ కూడా రేసులో ఉన్నారు. ప్రస్తుతం ఆయన పార్టీ ఓబీసీ మోర్చా చీఫ్‌గా వ్యవహరిస్తున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేసిన అనుభవం ఆయనకు ఉన్నది. రేసులో సునీల్ బన్సల్ పేరు కూడా వినిపిస్తున్నది. ఆయన తెలంగాణ, బెంగాల్, ఒడిశా రాష్ట్రాల ఇన్‌చార్జిగా ఉన్నారు. ఎంపీ ఓం మాథుర్ కూడా అధ్యక్ష రేసులో ఉన్నారు. మరోవైపు, పార్టీ తొలి మహిళా అధ్యక్షురాలిగా కేంద్ర మాజీ మంత్రి స్మృతి ఇరానీ నియమితులయ్యే అవకాశమున్నట్టు వార్తలు వస్తున్నాయి.

## అన్నామలై, తమిళిసై మధ్య ముదిరిన విభేదాలు



చెన్నై: లోక్ సభ ఎన్నికల ఫలితాలు తమిళనాడు బీజేపీలో ముసలం పుట్టించాయి. ఆ రాష్ట్ర బీజేపీ ప్రస్తుత, మాజీ అధ్యక్షులు కే అన్నామలై, తమిళిసై సౌందర్‌రాజన్ మధ్య విభేదాలు మరింత ముదురుతున్నాయి. ఇరువురి మద్దతుదారులు సామాజిక మాధ్యమాల్లో పరస్పరం బురద జల్లుకుంటున్నారు. తమిళిసై సౌందర్‌రాజన్ ఇటీవల మాట్లాడుతూ, బీజేపీలోకి 'సంఘ వ్యతిరేక శక్తులను తీసుకొచ్చార'న్నారు. దీనిపై రాష్ట్ర బీజేపీ ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి తిరుచ్చి సూరియ శివ మండిపడ్డారు. తమిళిసై సిఫారసు మేరకు నియమితుడైన ఎల్ మురుగన్ పదవీ కాలంలోనే క్రిమినల్ నేపథ్యం ఉన్నవారిని పార్టీలోకి చేర్చుకున్నారన్నారు. అలాంటివారి పేర్లతో ఓ జాబితాను తాను ఇవ్వగలనని చెప్పారు. రాష్ట్రంలో బీజేపీ ఓటమికి అన్నామలై కారణమని కొందరు ఆరోపించగా, ఆయన మద్దతుదారులు స్పందిస్తూ, రాష్ట్రంలో పార్టీ ఓటు షేర్ పెరిగిందని సమర్థిస్తున్నారు. తమిళిసై పార్టీ వ్యవహారాలను బహిరంగంగా చర్చిస్తున్నారని మండిపడుతున్నారు.

## నేడు ఒడిశా సీఎం ఎంపిక

భువనేశ్వర్, జూన్ 10: ఒడిశా బీజేపీ శాసన సభా పక్షం సమావేశం నేడు (మంగళవారం) జరుగుతుంది. బీజేపీ ఎంపీ ప్రతాప్ సారంగి తెలిపిన వివరాల ప్రకారం, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో సాయంత్రం 4.30 గంటలకు జరిగే ఈ సమావేశంలో ముఖ్యమంత్రి పదవికి అభ్యర్థిని ఎన్నుకుంటారు. పార్టీ పరిశీలకులుగా రాజ్‌నాథ్ సింగ్, భూపేందర్ యాదవ్ హాజరవుతారు. ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమం బుధవారం సాయంత్రం 5 గంటలకు జరుగుతుంది. ఒడిశాలో 147 శాసన సభ నియోజకవర్గాలు ఉన్నాయి. వీటిలో 78 స్థానాలను గెలుచుకుని రాష్ట్రంలో బీజేపీ తొలిసారి అధికారంలోకి వచ్చిన సంగతి తెలిసిందే. ముఖ్యమంత్రి పదవి రేసులో సురేశ్ పూజారి, మన్మోహన్ సమాల్, కేవీ సింగ్, మోహన్ మాఝీ తదితరుల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి.

## గెలిచినోళ్లకు దక్కని పదవి.. ఓడినోళ్లకు క్యాబినెట్ బెర్త్

**ఆసక్తికరంగా కేంద్ర మంత్రివర్గం కూర్పు**

న్యూఢిల్లీ, జూన్ 10: కేంద్రంలో మూడోసారి కొలువుదీరిన ఎన్డీయే సర్కార్ మంత్రివర్గ సభ్యుల ఎంపికలో కొన్ని ఆసక్తికర అంశాలు కనిపిస్తున్నాయి. ప్రధాని మోదీ నేతృత్వంలో 2019–24 టర్మ్‌లో పనిచేసి, ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో గెలిచిన కొత్త మంది నేతల పేర్లు తాజా క్యాబినెట్‌లో కనిపించకపోగా.. ఇదే సమయంలో ఓడిన నేతలకు మంత్రివర్గంలో చోటు కల్పించడం ప్రాధాన్యం సంతరించుకొన్నది. మోదీ రెండో ప్రభుత్వంలో కీలకమైన ఐటీ శాఖ మంత్రిగా పనిచేసిన అనురాగ్ ఠాకూర్.. తాజా లోక్‌సభ ఎన్నికల్లో హిమాచల్ ప్రదేశ్‌లోని హమీర్‌పూర్ నుంచి విజయం సాధించారు. అయితే మంత్రివర్గంలో ఆయనకు చోటుదక్కలేదు. మరోవైపు ఇటీవల బీజేపీలోకి వచ్చిన పంజాబ్ నేత రవ్‌నీత్ సింగ్ బిట్టుకు.. లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోయినప్పటికీ ఆశ్చర్యకరంగా క్యాబినెట్‌లో చోటు కల్పించారు. ఆయన పంజాబ్ మాజీ సీఎం బియాంత్ సింగ్ మనవడు. సిక్కుల ప్రాబల్యం ఉండే ఆప్ పాలిత పంజాబ్‌లో పార్టీ బలోపేతానికి బీజేపీ ఈ నిర్ణయం తీసుకొన్నట్టు తెలుస్తున్నది. గత ప్రభుత్వంలో పనిచేసి, లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోయిన వారిలో తమిళనాడు బీజేపీ మాజీ అధ్యక్షుడు ఎల్ మురుగన్‌కు మాత్రమే ఈసారి మంత్రి పదవి అవకాశం దక్కింది. ఓడిపోయిన స్మృతి ఇరానీ, రాజీవ్ చంద్రశేఖర్‌లను పక్కనబెట్టిన విషయం తెలిసిందే.



రవ్‌నీత్ సింగ్

### కేరళలో ఎదుగుదల కోసం..

అటు లోక్‌సభలో కానీ, ఇటు రాజ్యసభలో కానీ ఎంపీగా లేని కేరళ బీజేపీ నేత జార్జి కురియన్‌కు క్యాబినెట్ బెర్త్ కేటాయించారు. కేరళలో తొలిసారిగా ఎంపీ స్థానం గెలుచుకొన్న బీజేపీ.. భవిష్యత్తులో మరింత ముందుకు వెళ్లడంతోపాటు క్రిస్టియన్ మైనార్టీలకు చేరువయ్యేందుకు గత మూడు దశాబ్దాలుగా పార్టీలో ఉన్న జార్జి కురియన్‌కు మంత్రి పదవి ఇచ్చినట్టు విశ్లేషకులు చెబుతున్నారు.

## ఎన్నికల రాష్ట్రాలపై గురి!

**5 రాష్ట్రాలు, ఒక యూటీకి 30% మంత్రి పదవులు**

న్యూఢిల్లీ, జూన్ 10: సార్వత్రిక ఎన్నికల్లో మెజార్టీ మార్క్‌ను అందుకోలేక చతికిలపడ్డ బీజేపీ(240 స్థానాలు), త్వరలో వివిధ రాష్ట్రాల్లో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లోనూ గట్టి సవాల్ ఎదురవుతుందని భావిస్తున్నది. దీంతో అసెంబ్లీ ఎన్నికలకు వెళ్తున్న 5 రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతానికి కేంద్ర మంత్రివర్గంలో ప్రధాని మోదీ ప్రాధాన్యత ఇచ్చారు. ఆదివారం 71 మందితో మంత్రివర్గం ఏర్పాటుచేయగా, ఇందులో 21 మంది మంత్రులు (30శాతం పదవులు) అసెంబ్లీ ఎన్నికలు జరిగే రాష్ట్రాల నుంచి ఉండటం గమనార్హం. మహారాష్ట్ర, హర్యానా, జార్ఖండ్, బీహార్, ఢిల్లీ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతం జమ్ముకశ్మీర్ అసెంబ్లీలకు 2024, 2025లలో ఎన్నికలు రాబోతున్నాయి. హర్యానా, మహారాష్ట్ర, బీహార్‌లో ఎన్డీయేకు ప్రతికూల పవనాలు వీస్తున్నాయి. కీలక రాష్ట్రాల్లో బీజేపీ గెలుపు మోదీ సర్కార్‌కు సవాలేనని రాజకీయ నిపుణులు చెబుతున్నారు. అంతేగాక ఈ రాష్ట్రాల్లో లోక్‌సభ ఎన్నికల ఫలితాలు కూడా బీజేపీకి గట్టి షాక్ ఇచ్చాయి.

## మంత్రులకు కేటాయించిన శాఖలు ఇవే..

ప్రధాని నరేంద్ర మోదీ: సిబ్బంది వ్యవహారాలు, పింఛన్లు, ప్రజా ఫిర్యాదులు, అణుశక్తి, అంతరిక్షం, కీలక విధాన సంబంధిత అంశాలతోపాటు ఇతర మంత్రులకు కేటాయించని శాఖలు

### క్యాబినెట్ మంత్రులు

| | |
|---|---|
| 1.రాజ్‌నాథ్ సింగ్(బీజేపీ) | రక్షణ శాఖ |
| 2.అమిత్‌షా(బీజేపీ) | హోం, సహకార శాఖ |
| 3.నితిన్ గడ్కరీ(బీజేపీ) | రోడ్డు రవాణా, జాతీయ రహదారులు |
| 4.జేపీ నడ్డా(బీజేపీ) | ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం; రసాయనాలు, ఎరువులు |
| 5.శివరాజ్ చౌహాన్(బీజేపీ) | వ్యవసాయం, రైతు సంక్షేమం, గ్రామీణాభివృద్ధి |
| 6.నిర్మలా సీతారామన్(బీజేపీ) | ఆర్థికం, కార్పొరేట్ వ్యవహారాలు |
| 7.జైశంకర్(బీజేపీ) | విదేశాంగ వ్యవహారాలు |
| 8.ఖట్టర్(బీజేపీ) | గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి; విద్యుత్తు |
| 9. కుమారస్వామి(జేడీఎస్) | భారీ పరిశ్రమలు, ఉక్కు |
| 10.పీయూష్ గోయల్ (బీజేపీ) | వాణిజ్యం, పరిశ్రమలు |
| 11.ధర్మేంద్ర ప్రధాన్(బీజేపీ) | విద్యా శాఖ |
| 12.మాంఝీ(హెచ్ఎంఎం) | సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు |
| 13.లలన్ సింగ్(జేడీయూ) | పంచాయతీ రాజ్, మత్స్య, పశు సంవర్ధక, డెయిరీ |
| 14.శర్బానంద సోనోవాల్ (బీజేపీ) | పోర్టులు, షిప్పింగ్, వాటర్ వేస్ |
| 15.రామ్మోహన్ నాయుడు(టీడీపీ) | పౌర విమానయానం |
| 16.డాక్టర్ వీరేంద్ర కుమార్(బీజేపీ) | సామాజిక న్యాయం, సాధికారత |
| 17.జుయెల్ ఓరమ్(బీజేపీ) | గిరిజన వ్యవహారాలు |
| 18.ప్రహ్లాద్ జోషి(బీజేపీ) | వినియోగదారు వ్యవహారాలు ఆహారం, ప్రజా పంపిణీ; నూతన, పునరుత్పాదక ఇంధనం |
| 19.అశ్విని వైష్ణవ్(బీజేపీ) | రైల్వే శాఖ, సమాచార-ప్రసారాలు, ఐటీ, ఎలక్ట్రానిక్స్ |
| 20.గిరిరాజ్ సింగ్(బీజేపీ) | జౌళి పరిశ్రమ |
| 21.జ్యోతిరాదిత్య సింధియా(బీజేపీ) | కమ్యూనికేషన్స్; ఈశాన్య రీజియన్ అభివృద్ధి |
| 22.భూపేంద్ర యాదవ్(బీజేపీ) | పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పులు |
| 23.గజేంద్ర సింగ్ షెకావత్(బీజేపీ) | సాంస్కృతికం, పర్యాటకం |
| 24.అన్నపూర్ణ దేవి(బీజేపీ) | మహిళా, శిశు సంక్షేమాభివృద్ధి |
| 25.కిరణ్ రిజిజు(బీజేపీ) | పార్లమెంటరీ వ్యవహారాలు, మైనార్టీ వ్యవహారాలు |
| 26.మన్సుఖ్ మాండవీయ(బీజేపీ) | కార్మిక, ఉపాధి శాఖ; యువజన వ్యవహారాలు, క్రీడలు |
| 27.హర్దీప్ సింగ్ పురీ(బీజేపీ) | పెట్రోలియం, సహజ వాయువు |
| 28. కిషన్ రెడ్డి(బీజేపీ) | బొగ్గు, గనులు |
| 29.చిరాగ్ పాశ్వాన్(ఎల్జేపీ) | ఆహార శుద్ధి పరిశ్రమలు |
| 30.సీఆర్ పాటిల్ (బీజేపీ) | జల్ శక్తి |

### సహాయ మంత్రులు(స్వతంత్ర హోదా)

| | |
|---|---|
| 1.రావ్ ఇందర్‌జిత్ సింగ్(బీజేపీ) | గణాంకాలు, కార్యక్రమాల అమలు, ప్లానింగ్, సాంస్కృతిక |
| 2.జితేంద్ర సింగ్(బీజేపీ) | సైన్స్ అండ్ టెక్నాలజీ; భౌగోళిక శాస్త్ర; ప్రధాన మంత్రి కార్యాలయం, సిబ్బంది వ్యవహారాలు, ప్రజా ఫిర్యాదులు, పింఛన్లు, అణుశక్తి, అంతరిక్షం |
| 3.అర్జున్ రామ్ మేఘ్వాల్ (బీజేపీ) | న్యాయం, పార్లమెంటరీ వ్యవహారాలు |
| 4.జాదవ్ ప్రతాప్ రావ్ గణ్‌పత్‌రావ్(శివసేన) | ఆయుష్; ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం |
| 5.జయంత్ చౌదరి(ఆరెల్డీ) | నైపుణ్యాభివృద్ధి, ఆంత్రపెన్యూర్‌షిప్; విద్య |

### సహాయ మంత్రులు

| | |
|---|---|
| 1.జితిన్ ప్రసాద(బీజేపీ) | వాణిజ్యం, పరిశ్రమలు; ఐటీ, ఎలక్ట్రానిక్స్ |
| 2.శ్రీపాద యశో నాయక్(బీజేపీ) | విద్యుత్తు; నూతన, పునరుత్పాదక ఇంధనం |
| 3.పంకజ్ చౌదరి(బీజేపీ) | ఆర్థికం |
| 4.క్రిషన్ పాల్ (బీజేపీ) | సహకార శాఖ |
| 5.రామ్‌దాస్ అథవాలే(ఆర్పీఐ) | సామాజిక న్యాయం, సాధికారత |
| 6.రామ్‌నాథ్ ఠాకూర్(జేడీయూ) | వ్యవసాయం, రైతు సంక్షేమం |
| 7.నిత్యానంద్ రాయ్(బీజేపీ) | హోం శాఖ |
| 8.అనుప్రియా పటేల్ (అప్నాదల్) | ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం; రసాయనాలు, ఎరువులు |
| 9.వీ సోమన్న(బీజేపీ) | జల్ శక్తి; రైల్వే |
| 10.పెమ్మసాని చంద్రశేఖర్(టీడీపీ) | గ్రామీణాభివృద్ధి; కమ్యూనికేషన్స్ |
| 11.ఎస్పీ సింగ్ బఘేల్ (బీజేపీ) | మత్స్య, పశు సంవర్ధక, డెయిరీ; పంచాయతీ రాజ్ |
| 12.శోభా కరంద్లాజే(బీజేపీ) | సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు; కార్మిక, ఉపాధి |
| 13.కీర్తివర్ధన్ సింగ్(బీజేపీ) | పర్యావరణం, అటవీ, వాతావరణ మార్పులు, విదేశాంగ |
| 14.బీఎల్ వర్మ(బీజేపీ) | వినియోగదారు వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ; సామాజిక న్యాయం, సాధికారత |
| 15.శాంతను ఠాకూర్(బీజేపీ) | పోర్టులు, షిప్పింగ్, వాటర్‌వేస్ |
| 16.సురేశ్ గోపి(బీజేపీ) | పెట్రోలియం, సహజ వాయువు; పర్యాటకం |
| 17.ఎల్ మురుగన్(బీజేపీ) | సమాచార, ప్రసార శాఖ; పార్లమెంటరీ వ్యవహారాలు |
| 18.అజయ్ తమ్టా(బీజేపీ) | రోడ్డు రవాణా, జాతీయ రహదారులు |
| 19.బండి సంజయ్ కుమార్(బీజేపీ) | హోం శాఖ |
| 20.కమలేశ్ పాశ్వాన్(బీజేపీ) | గ్రామీణాభివృద్ధి |
| 21.భగీరథ్ చౌదరి(బీజేపీ) | వ్యవసాయం, రైతు సంక్షేమం |
| 22.సతీశ్ చంద్ర దూబే(బీజేపీ) | బొగ్గు, గనులు |
| 23.సంజయ్ సేథ్(బీజేపీ) | రక్షణ |
| 24.రవ్‌నీత్ సింగ్(బీజేపీ) | ఆహార శుద్ధి పరిశ్రమలు; రైల్వే |
| 25.దుర్గాదాస్ ఉయికే(బీజేపీ) | గిరిజన వ్యవహారాలు |
| 26.రక్షా నిఖిల్ ఖడ్సే(బీజేపీ) | యువజన వ్యవహారాలు, క్రీడలు |
| 27.సుకాంత మజుందార్(బీజేపీ) | విద్య, ఈశాన్య రీజియన్ అభివృద్ధి |
| 28.సావిత్రి ఠాకూర్(బీజేపీ) | మహిళా, శిశు సంక్షేమాభివృద్ధి |
| 29.తోఖన్ సాహు(బీజేపీ) | గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి |
| 30.రాజ్ భూషణ్ చౌదరి(బీజేపీ) | జల్ శక్తి |
| 31.భూపతిరాజు శ్రీనివాస వర్మ(బీజేపీ) | భారీ పరిశ్రమలు; ఉక్కు |
| 32.హరీశ్ మల్హోత్రా(బీజేపీ) | కార్పొరేట్ వ్యవహారాలు; రోడ్డు రవాణా, హైవేలు |
| 33.నిముబెన్ జయంతీభాయ్ బంభానియా(బీజేపీ) | వినియోగదారు వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ వ్యవస్థ |
| 34.మురళీధర్ మొహోల్ (బీజేపీ) | సహకారం; పౌర విమానయానం |
| 35.జార్జి కురియన్(బీజేపీ) | మైనార్టీ వ్యవహారాలు; మత్స్య, పశు సంవర్ధక, డెయిరీ |
| 36.పబిత్ర మార్గెరీటా(బీజేపీ) | విదేశీ వ్యవహారాలు, జౌళీ పరిశ్రమ |